

తాగునీటి సమస్య పరిష్కరించాలి



రాస్తారోకో చేస్తున్న తుమ్మలగూడ గ్రామస్థులు

బెజ్జూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని తుమ్మలగూడ గ్రామానికి చెందిన మహిళలు, గ్రామస్థులు తాగునీటి సమస్య పరిష్కరించాలి ఖాళీ బిందెలతో శనివారం బెజ్జూరు- డబ్బా ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా ఎవరు పట్టించుకోవడం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 15 రోజులుగా తాగునీటికి తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నప్పటికీ సమస్య పరిష్కరించడం లేదన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అక్కడికి చేరుకుని మహిళలతో మాట్లాడి రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామానికి ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేయించడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

కొనసాగుతున్న సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట హాస్టల్ డెయిలీవేజ్ వర్కర్లు చేపడుతున్న సమ్మె 16వ రోజుకు చేరుకుంది. శనివారం గడ్డి తింటూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కృష్ణమాచారి, యూనియన్ నాయకులు ప్రభాకర్, వసంత్‌రావు, రాంబాబు, కోటయ్య, సదాశివ్, లక్ష్మి, లక్ష్మణ్, భరత్, రమేష్, సంతోష్, శశికళ, ప్రమీల, ఇందు, రామదాస్, గంగుబాయి, జంగుదేవి, సీతారాం, లత, తార, గంగుబాయి, తిరుపతి, రుక్మాబాయి, దివ్య, లక్ష్మి, మాన్కు, రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

దహెగాం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం అయినం గ్రామంలోని కంబాల అంజలి(17) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజలి నాలుగు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతోంది. గురువారం తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగుల మందు తాగింది. సాయంత్రం ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు పురుగుల మందు తాగిన విషయాన్ని గమనించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. అంజలి తండ్రి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు మండల స్థాయి పోటీలు

రెబ్బెన, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గోలేటి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో అర్జున్ చారిటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు అజ్మీరా అర్జున్, జాతీయ కబడ్డీ ప్లేయర్ శ్రీకృష్ణ తెలిపారు. మొదటి బహుమతి రూ.3100, ద్వితీయ బహుమతి రూ.2000 అందించనున్నామని తెలిపారు. పోటీలకు గౌరవ అతిథులుగా జీఎం విజయభాస్కర్‌రెడ్డి, ఎస్సై వెంకటకృష్ణ హాజరుకానున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

పెంచికలపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన సారంపల్లి పోశన్నకు మంజూరైన రూ.16 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్సీ దండె విఠల్ ఆదేశాల మేరకు శనివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సరిత రాజన్న, చంద్రమౌళి, శంకర్‌గౌడ్, చందు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందుతో జాగ్రత్త



- పిచికారి సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయం
- అధికారుల సూచనలు పాటిస్తే మేలు

పంటలకు ఇటీవల కాలంలో రసాయనిక మందుల వాడకం గణనీయంగా పెరిగింది. వివిధ రకాల పురుగులు, తెగుళ్లను నివారించేందుకు రైతులు ప్రమాదకరమైన మందులను ఆశ్రయిస్తున్నారు. కానీ పురుగుల మందు పిచికారి చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల అస్వస్థతకు గురవుతున్నారు.

వాంకిడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు అధిక దిగుబడినిచ్చే విత్తనాలను రూపొందిస్తుండగా, మరో వైపు ఆ పంటలపై ఆశించే చీడపీడల నుంచి పంటను కాపాడేందుకు రైతుల క్రిమిసంహారక మందులు వాడడం పరిపాటిగా మారింది. ఆయా పంటలకు జరిగే నష్టంలో దాదాపు 20-25 శాతం చీడపీడల వల్లే కలుగుతున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం పత్తి, వరిలో పురుగు నివారణకు రైతులు ఒక్కటికి రెండు సార్లు పురుగుల మందులు పిచికారి చేస్తున్నారు. రెండేళ్ల నుంచి జిల్లాలో పత్తి పంటపై పురుగు మందులు పిచికారి చేయడంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ముగ్గురు రైతులు మృత్యువాత పడ్డారు. పలువురు రైతులు పురుగు మందు ప్రభావంతో అస్వస్థతకు గురై చికిత్స పొందారు.

అవగాహన లేక..

పురుగుల మందుల వాడకంపై రైతులకు పెద్దగా అవగాహన ఉండడంలేదు. గ్రామాల్లో ఫెర్టిలైజర్ డీలర్లు పురుగులమందుల వ్యాపారులు చెప్పె మందులనే పిచికారి చేస్తున్నారు. ఒక్కో కంపెనీ తయారు చేసే మందు ప్రభావం ఒక్కో రకంగా ఉంటుంది. ఇవి పిచికారి చేసే వ్యక్తిపై తీవ్ర ప్రభావం చూపుతుంటాయి. ఏ పురుగుకు ఏ మోతాదులో ఏ మందు వాడాలో రైతులకు తెలియని పరిస్థితి ఉంది. కొన్ని రసాయన మందులు ఘాటైన వాసన ఉండి ఉంటే మరికొన్ని తేలికగా ఉంటాయి. రైతులు ఇవేమి పట్టించుకోకుండా ఇష్టం వచ్చినట్లు మందులను పిచికారి చేస్తూ ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు.

పిచికారి సమయంలో నిర్లక్ష్యం..

చాలా మంది రైతులు రసాయన మందులు పిచికారి చేసేటప్పుడు బీడీలు, సిగరేట్లు తాగడం, గుట్కా నమలడం, తంబాకు నోట్లో వేసుకోవడం చేస్తుంటారు. అలాగే మధ్యాహ్న సమయంలో చేతులను సబ్బుతో కాకుండా కేవలం నీళ్లతో కడిగి భోజనం చేస్తుంటారు. దీంతో మందు ప్రభావం తమకు తెలియకుండానే వివిధ రూపాల్లో మనిషి శరీరంలోకి ప్రవేశిస్తుంది.

దీంతో మనిషి నాడి వ్యవస్థ, శ్వాస వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అలాగే గాలి ఏ వైపు నుంచి వీస్తుందో గమనించక ఇష్టమొచ్చినట్లు పిచికారి చేస్తుంటారు. దీంతో రసాయన మందు గాలిలో కలిసి శ్వాస తీసుకుంటున్నప్పుడు ముక్కు ద్వారా శరీరంలోకి వెళ్లి వాంతులు కావడం, తల తిప్పడం, శరీరమంతా చెమటలు పట్టడం, సరైన శ్వాస అందకపోవడం వంటివి జరుగుతుంటాయి.

జాగ్రత్తలు పాటించాలి..

ఎస్‌కే రియాజ్, వైద్యాధికారి. వాంకిడి



రైతులు, రైతు కూలీలు పిచికారి సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. చేతులకు గ్లౌజ్‌లు వేసుకోవాలి. స్ప్రేయర్లకు లీకేజీలు లేకుండా చూసుకోవాలి. మందు నీళ్ల శరీరంపై పడకుండా లూజు దుస్తులు ధరించాలి. పిచికారి పూర్తయిన తర్వాత తలభాగం నుంచి సబ్బుతో స్నానం చేయాలి. పిచికారి చేసే వ్యక్తికి ఏవైనా గాయాలుంటే అవి కనబడకుండా ప్లాస్టర్ వేసుకోవాలి. పిచికారి సమయంలో ఏమైనా అనారోగ్యానికి గురైతే సమీపంలోని వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి. మందు ప్రభావం ఎంత గాఢతదో తెలుసుకునేందుకు మందు డబ్బాను చూపించాలి.

సిఫారుసు మేరకు వాడాలి..

గోపికాంత్, మండల వ్యవసాయ అధికారి



పురుగుమందులు ఏ సమయంలో వాడాలో చాలా మంది రైతులకు తెలియడం లేదు. ముందుగా సాగు చేసిన పంటలను రెండు మూడు రోజుల కోసారి పరిశీలించాలి. ఏ పురుగువల్ల ఎలాంటి నష్టం జరుగుతుందనే దానిపై అవగాహనకు వచ్చిన తర్వాత మందులు వాడాలి. రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పురుగుమందులు పిచికారి చేయాలి.

మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలి



కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహనీయుల జీవిత చరిత్రలను భావితరాలకు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, పద్మశాలి సేవా సంఘం, బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్‌బాపూజీ ఆసిఫాబాద్ జిల్లా వాసి కావడం గర్వకారణమని తెలిపారు. తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమాలలో పాల్గొని రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి సజీవన్, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, పద్మశాలి సేవా సంఘం నాయకులు అంజనేయులు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం కొండాలక్ష్మణ్‌బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అంజన్న, సీఐ రాణాప్రతాప్, బుద్దే రవీందర్, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, సీసీ కిరణ్, సూపరింటెండెంట్ ఖలీముద్దీన్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం పద్మశాలి భవన కమిటీ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి భవన కమిటీ సభ్యులు సిందం చంద్రయ్య, రాష్ట్ర నాయకులు నల్ల కనకయ్య, రాపెల్లి సదానందం, గుళ్లపల్లి నాగేశ్వర్ రావు, గడదాసు మల్లయ్య, దోమల సురవర్ధన్, నూతి సుదర్శన్, కార్యవర్గ సభ్యులు సిందం శ్రీనివాస్, సుంక లింగమూర్తి, మాచర్ల శ్రీనివాస్, దండే భీమయ్య పాల్గొన్నారు.

వాంకిడి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లక్ష్మణ్ సేవాసదన్, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని వేడుకలను నిర్వహిచారు. తెలంగాణ సాధనకోసం ఆయన చేసిన త్యాగాలను కొనియాడారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో లక్ష్మణ్‌సేవాసదన్ చైర్మన్ గాదే అవినాష్, వైస్ చైర్మన్ మహోల్కార్ అశోక్, కార్యదర్శి మడావి దౌలత్, పద్మశాలి సంఘం నాయకులు ఒడ్డెపల్లి సతీష్, బండు, మొండయ్య, ఎంగలి రాకేష్, అశుతోష్, నరేష్, అంబెద్కర్ సంఘం నాయకులు జైరాం, దుర్గం దుర్గాజీ, విజయ్, శ్యాంరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



వాంకిడిలో నివాళులు అర్పిస్తున్న లక్ష్మణ్ సేవాసదన్ సభ్యులు

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి తహసీల్దార్ సంతోష్‌కుమార్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గిర్దావర్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది స్రవంత, విజయలక్ష్మి, కర్రయ్య, అక్బర్‌షా, విశ్వాస్, రాజు, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఆర్‌ఐ వేణు, సీనియర్ అసిస్టెంట్ అచ్యుతరావు, జీపీవో మారుతి పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునావర్ షరీఫ్, డీటీ గణేష్, ఆర్‌ఐ నాగభూషణం పాల్గొన్నారు.

గంటన్నర పాటు భారీ వర్షం

- ఆసిఫాబాద్ మండలంలో 61.3 మిల్లీమీటర్లు నమోదు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఆసిఫాబాద్ పట్టణంలో మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఎడతెరిపి లేకుండా గంటన్నరపాటు భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా కాలనీల్లోకి వరదనీరు వచ్చి చేరింది. కూరగాయాల మార్కెట్‌లో భారీగా వరదనీరు వచ్చి చేరడంతో మార్కెట్‌కు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షానికి తుంపల్లివాగు, రాజూరా ఒర్రె, అప్పపెల్లివాగులు ఉధృతంగా ప్రవహించాయి. రెబ్బెన, వాంకిడి, కాగజ్‌నగర్, సిర్పూర్ (టి), మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఆసిఫాబాద్ మండలంలో అత్యధికంగా 61.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రెబ్బెనలో 36.5, కాగజ్‌నగర్‌లో 13.3, వాంకిడిలో 7.3, సిర్పూర్(టి)లో 6.5, కెరమెరిలో 6.3, బెజ్జూరులో 4.5, చింతలమానేపల్లి, జైనూరు మండలాల్లో 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



జలమయమైన ఆసిఫాబాద్ జూబ్లీ మార్కెట్

సంక్షిప్త సమాచారం

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): జన్కాపూర్ పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయుడు వడ్లూరి రాజేష్ జతదార ఎడ్యూకేషనల్ టెక్నాలజీ వారు అందించే జేట్ ఎన్నోవేటీవ్ టీచర్ అవార్డు -2025కి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌బాబు తెలిపారు. అవార్డును జేట్ ప్రాజెక్టు డైరెక్టర్ అరుణ్‌కుమార్ చేతుల మీదుగా ఈ నెల 29న హైదరాబాద్‌లోని హరహర కళా భవన్‌లో అందుకోనున్నారు.

తిర్యాణి,(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పల్లవి, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ కృష్ణ, డాక్టర్ అక్షిత్, డాక్టర్ దీపిక, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ అక్షిత పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్‌లో స్వయంభుగా వెలిసిన శ్రీ మహంకాళి దేవి ఆలయంలో నవరాత్రుల సందర్భంగా శనివారం ఆరో రోజు శ్రీలలిత త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు దర్శనమివ్వడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు దేవర వినోద్ స్వామి ఆలయ అధ్యక్షుడు తిరుపతిగౌడ్ అన్నదానం చేశారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రంగనాయక ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద మహిళలు 21 రకాల నైవేద్యాలు సమర్పించారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బాపూనగర్ శారదగణేష్ మండలి వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని 16 గ్రామ పంచాయతీ పరిధిలో 144 వార్డు సభ్యుల, మహిళా వార్డు సభ్యుల రిజర్వేషన్లపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో సత్యనారాయణ సమీక్షా సమావేశం నిర్వహించారు.

జడ్పీటీసీ, ఎంపీపీల రిజర్వేషన్లు ఖరారు

● లక్కీడ్రా పద్ధతిన కేటాయించిన అధికారులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని 15 మండలాల జడ్పీటీసీ, ఎంపీపీల రిజర్వేషన్లను శని వారం జిల్లా అధికార యంత్రాంగం ఖరారు చేసిం ది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారితోకలిసి జిల్లాలోని జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలరిజర్వేషన్ ప్రక్రియను డ్రాపద్ధతిన నిర్వహించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో డ్రా పద్ధతిన రిజర్వేషన్ స్థానాల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల, వెనుకబడిన తెగల, మహిళ స్థానాల కేటాయింపు రిజర్వేషన్ ప్రక్రియను డ్రా పద్ధతిన నిర్వహించడం జరిగింద న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మినారయణ, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


లక్కీ డ్రా ద్వారా రిజర్వేషన్లను తీస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

జడ్పీటీసీ, ఎంపీపీల రిజర్వేషన్ల వివరాలు ఇలా..

క్రమ సంఖ్య	మండలం	జడ్పీటీసీ	ఎంపీపీ
1.	ఆసిఫాబాద్	ఎస్టీ(జనరల్)	ఎస్టీమహిళ
2.	సిర్పూర్(యూ)	జనరల్	ఎస్టీ మహిళ
3.	లింగాపూర్	జనరల్ మహిళ	ఎస్టీ మహిళ
4.	జైనూరు	బీసీ జనరల్	ఎస్టీ జనరల్
5.	తిర్యాణి	బీసీ మహిళ	జనరల్
6.	కెరమెరి	బీసీ జనరల్	జనరల్ మహిళ
7.	వాంకిడి	ఎస్టీ మహిళ	ఎస్టీ జనరల్
8.	రెబ్బెన	బీసీ మహిళ	బీసీ జనరల్
9.	బెజ్జూరు	ఎస్టీ జనరల్	ఎస్టీ జనరల్
10.	పెంచికలపేట	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ
11.	కాగజ్‌నగర్	బీసీ మహిళ	బీసీ మహిళ
12.	కౌటాల	బీసీ జనరల్	బీసీ జనరల్
13.	చింతలమానేపల్లి	ఎస్టీ జనరల్	బీసీ మహిళ
14.	దహెగాం	ఎస్టీ మహిళ	ఎస్సీ జనరల్
15.	సిర్పూర్(టి)	ఎస్సీ జనరల్	బీసీ జనరల్

ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శనివారం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నిక నిర్వహణలో భాగంగా రిటర్నింగ్ అధికారులకు, సహాయ రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జడ్పీ సీఈవో లక్ష్మినారాయణలతో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైందని తెలిపారు. నోటిఫికేషన్ విడుదల అయిన తరువాత నామినేషన్ పత్రాల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు తమకు అప్పగించిన విధులను పకడ్బందీ గా నిర్వహించాలని సూచించారు. హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు.

ఏసీబీకి చిక్కిన ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్


లంచం తీసుకున్న టెక్నికల్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్

కన్నెపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్ శనివారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. కన్నెపల్లికి చెందిన ఓ రైతు క్యాటిల్ షెడ్ (పశువుల పాక) కోసం ఈజీఎస్ పథకంలో దరఖాస్తు చేసుకున్నాడు. క్యాటిల్ షెడ్ బిల్లు రూ. 70 వేలు కాగా ఇందులో రూ. 48 వేలు మంజూరయ్యాయి. మిగితా బిల్లు మంజూరు కావాలంటే రూ. 10 వేలు లంచం ఇవ్వాలని టెక్నికల్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్ రైతును డిమాండ్ చేశారు. దీంతో రైతులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. శనివారం బాధితుడి నుంచి టెక్నికల్ అసిస్టెంట్ రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ ఆదిలాబాద్ రేంజ్ డీఎస్పీ మధు, తన సిబ్బందితో కలిసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ మొదటి దఫా బిల్లుకోసం రూ. ఆరు వేలు ఇచ్చానని, మళ్లీ రూ. 10 వేలు డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించానన్నారు. ఏసీబీ ఆదిలాబాద్ రేంజ్ డీఎస్పీ మధు మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలిస్తామన్నారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం అడిగితే టోల్‌ఫ్రీ నెంబర్ 1064, ఫోన్ నంబర్ 9154388963, వాట్సాప్ నంబర్ 9440446106కు తెలియజేయాలని సూచించారు.

వేధింపులతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


ఐశ్వర్య(ఫైల్)

దండేపల్లి సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలోని ఎంపిసి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మండలంలోని పెద్దపేట గ్రామానికి చెందిన బొడ్డు ఐశ్వర్య(17) అనే విద్యార్థిని తోటి విద్యార్థి వేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పంది. ఎస్సై తహసీనోద్దీన్, వారి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దపేట గ్రామానికి చెందిన బోడ్డు ఐశ్వర్య ఇంటర్‌లో ఎంపిసి ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఆదే కళాశాలోని మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన కండ్లపల్లి అజయ్ అనే యువకుడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా అజయ్ పదేపదే ఐశ్వర్య వెంటపడుతూ తనను ప్రేమించాలని వేధించేవాడు. ఈనెల 24న దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే, బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. కార్యక్రమానికి హజరైన అజయ్, ఐశ్వర్యను కళాశాల వద్దనే బలవంత పెడుతూ తనను ప్రేమించాలని వేధిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేసి దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీంతో అవమానం భరించలేక ఐశ్వర్య గురువారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్నాయతానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తహసీనోద్దీన్ వెల్లడించారు.

బస్సు టైరు కింద పడి మహిళకు గాయాలు

చెన్నూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు నుంచి వేమనపల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కే క్రమంలో ఓ మహిళ కాలు పైనుంచి బస్సు టైరు వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. వేమనపల్లి మండలం దస్నాపూర్ గ్రామానికి చెందిన ఓల నవీష అనే మహిళ శనివారం చెన్నూరు పట్టణంలోని రావి చెట్టు బస్టాప్ వద్ద బస్సు ఎక్కే ప్రయత్నం చేసింది. ఈ సమయంలో డ్రైవర్ బస్సును ఆపి వెనక్కి తీస్తున్న క్రమంలో ఆమె కాలుపై నుంచి ముందు టైరు వెళ్లడంతో తీవ్ర గాయాలపాలైంది. వెంటనే మహిళను స్థానికులుప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి


మాట్లాడుతున్న సీఐటీయూ కేంద్ర కమిటీ నాయకుడు రాజేందర్

మందమర్రిటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థకు ప్రభుత్వం బకాయి పడిన రూ. 42 వేల కోట్లను వెంటనే చెల్లించాలని సీఐటీయూ కేంద్ర కమిటీ నాయకులు అల్లి రాజేందర్ డిమాండ్ చేశారు. స్థానికంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో సింగరేణి సంస్థ నుంచి నిధులు దారి మళ్లించారని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో 3వేల కోట్లకుపైగా వాటా నుంచి పక్కన పెట్టారన్నారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం కూడ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 4వేల కోట్లను పక్కన పెట్టిందని పేర్కొన్నారు. ప్రస్తుతం సింగరేణిలో రానున్న రోజుల్లో దాదాపు పాత గనులు అన్ని మూతపడుతున్నాయని తెలిపారు. దీంతోట కోల్‌బెల్ట్‌లో నిరుద్యోగం పెరిగిపోయే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం లాభాల వాటా నుంచి తీసిన నిధులతో నూతన గనుల ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా చెల్లింపునకు సర్క్యులర్ జారీ

మందమర్రిటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి లాభాలావాటాకు సంబంధించి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసింది. ఈ సంవత్సరం 802.40 కోట్లు, 34శాతం ప్రకటించింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 42వేల మందికి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనుంది. ఇప్పటికే సర్క్యులర్ అన్ని గనుల, డిపార్టుమెంట్లకు జారీ చేసింది.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మున్సి పాలిటిలో గతంలో నర్సరీ కాంట్రాక్టు నిర్వహించిన శ్రీసాయిరాం కన్‌స్ట్రక్షన్ నిర్వాహకులపై చర్యలు తీసుకో వాలని శనివారం మున్సిపాలిటీ డీఈ సుమతికి కాంట్రాక్టు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నాలుగు నెలల నుంచి కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని చెప్పారు. కాంట్రాక్టర్‌కు మున్సిపాలిటి నుంచి బిల్లులు వచ్చినా వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. మళ్లీ అదే కాంట్రాక్టర్‌కు మున్సిపాలిటిలో శానిటేషన్ కార్మికుల కాంట్రాక్టు వచ్చిందని, అధికారులు రద్దు చేయాలని కోరారు.

ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ


బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆడపడుచులు ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో శనివారం ఏర్పా టు చేసిన బతుకమ్మ సంబరాల్లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచం లో ఎక్కడా లేని విధంగా ప్రకృతిలో లభించే పూజ లను సేకరించి బతుకమ్మ పేర్చి ప్రకృతిని దేవతగా కొలిచే తెలంగాణ మహిళల సాంస్కృతిక పండగ వేడుక అని అన్నారు. తెలంగాణలో ఆడపడుచులకు ఎంతో గౌరవం ఉంటుందని చెప్పారు. మహిళలం దరు కలిసి సంతోషంగా జరుపుకునే బతుకమ్మ సంబరాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి దిశగా అనేక పథకాల ద్వారా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు, కలెక్టరేట్‌లోని మహిళా ఉద్యోగులకు, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో లేగ దూడ మృతి

పెంచికలపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట రేంజ్ పరిధిలోని పోతెపల్లి బీట్‌లోని ఎర్రగుంట గ్రామ శివారు అటవీ ప్రాంతంలో శుక్రవారం లేగదూడపై చిరుత పులి దాడి చేసి హతమార్చింది. అటవీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగుంట గ్రామానికి చెందిన శేఖర్ అనే రైతు పశువులు మేత కోసం అటవీ ప్రాంతానికి వెళ్లగా లేగ దూడ తిరిగి రాలేదు. మరుసటి రోజు ఉదయం గస్తీ తిరుగుతున్న అటవీ సిబ్బంది చిరుత పాదముద్రికలు గమనించారు. వాటిని ట్రాకింగ్ చేస్తూ వెళ్లగా లేగదూడ కళేబరం కనిపించింది. వెంటనే అటవీ సిబ్బంది పెంచికలపేట పశువైద్యాధికరి డాక్టర్ రాకేష్‌కు సమాచారం అందించారు. ఆయన సమక్షంలో కళేబరాన్ని పరిశీలించగా చిరుత దాడిలో మృతి చెందినట్లు నిర్ధారించారు. అటవీ ప్రాంతంలో చిరుత, వన్యమృగాలు సంచరిస్తున్న కారణంగా సమీప గ్రామాల ప్రజలు, పశువుల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

యూరియా కోసం రైతుల పాట్లు

దహెగాం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతుల పాట్లు తప్పడం లేదు. శనివారం దహెగాం మండలంలోని దహెగాం పీఏసీఎస్, బీబ్రా రైతు వేదిక, గిరివెల్లి రైతు వేదికలో యూరియా కోసం రైతులు తరలి వచ్చారు. దహెగాం పీఏసీఎస్ వద్ద కల్వాడ, పంబా పూర్, మర్రిపల్లి, కమ్మర్‌పల్లి, పార్వతిపేట, తదితర గ్రామాల రైతులు తరలి వచ్చారు. దహెగాం పీఏసీఎస్‌లో 888, బీబ్రాలో 444, గిరివెల్లిలో 444 యూరియా బస్తాలు పంపిణీ చేసినట్లు ఏవో రామకృష్ణ తెలిపారు. పంపిణీలో సీఈవో బక్కయ్య, ఏఈవోలు వంశీ, ఆనంద్‌రావు, సిబ్బంది సాయి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): యూరియా టోకెన్ల కోసం మండల కేంద్రంలోని రైతు వేదికలో పెద్ద సంఖ్యలో రైతులు బారులు తీరారు. ఒక్కో పట్టా పాసు పుస్తకానికి ఒక్కో టోకెన్‌ను అందజేశారు. యూరియా వచ్చిన తరువాత టోకెన్ల ద్వారా పంపిణీ చేస్తామని ఏవో గిరీష్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు విశాల్, రవికుమార్, నేహతబసుం, శోభ, సిబ్బంది పాల్గొన్నారు.


దహెగాంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు



ఎస్టీపీపీలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

జైపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అక్టోబరు 1న జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ చంచల్ సర్కార్ మాట్లాడుతూ రక్తదానం చేయడమంటే ప్రాణదానం చేయడమేనని తెలిపారు. సేకరించిన రక్తాన్ని తలసేమియా వ్యాధి గ్రస్తులకు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందే వారికి ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ అధికారులు సుదీష్ జాకర్, బాల సుబ్రమణ్యం, దివార్, రెడ్‌క్రాస్ సొసైటి ఎంసీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, బ్లడ్ బ్యాంకు సిబ్బంది సురేష్, శిరీష, హరీష్‌పాల్గొన్నారు.

దసరా సెలవులో మార్పు చేయాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి అయిన అక్టోబర్ 2వ తేదీన దసరా వస్తున్నందున సింగరేణి కార్మికులకు మరుసటి రోజు ప్రకటించాలని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు వి అనిల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌కే 7 గనిపై నిర్వహించిన సమా వేశంలో వారు మాట్లాడారు. సెలవు విషయమై తమ యూనియన్ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవు మార్పు విషయంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు బాధ్యతారాహి త్యంగా ప్రవర్తిస్తున్నాయని చెప్పారు. యాజమాన్యం స్పందించి దసరా సెలవును అక్టోబర్ 3వ తేదీన ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఏరియ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనులపై హోమాలు..అన్నదానాలు..

శ్రీరాంపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని పలు గనుల్లో శనివారం హోమాలు, అన్నదానాలు నిర్వహించారు. పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు. దుర్గా మాత నవరాత్రి ఉతవాలను పురస్కరించుకొని శ్రీరాంపూర్ ఓసీపీ, ఆర్‌కే 7. ఆర్‌కే న్యూటెక్, ఎస్ఆర్‌పీ 1 గనులపై హోమాలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్, సింగరేణి అధికారులు, పట్టణ ప్రజలు అమ్మవార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఆయా గనులను శ్రీరాంపూర్ జీఎం సందర్శించి వేడుకల్లో పాల్గొన్నారు. అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయనకు పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలికి, సన్మానం చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీలో జీఎం శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు ఉమారాణి బోనాల వేడుకలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో ఏజెంట్లు, పీవోలు, మేనేజర్లు, సంక్షేమాధికారులు, పిట్ కార్యదర్శులు, అన్ని యూనియన్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గోలేటి సీహెచ్‌పీలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండలి వద్ద జీఎం విజయభాస్కర్‌రెడ్డి శనివారం కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రాజమల్లు, సీహెచ్‌పీ అధికారులు పాల్గొన్నారు.


శ్రీరాంపూర్ ఓసీపీలో బోనంతో వెళ్తున్న జీఎం శ్రీనివాస్

ఆర్‌కే 6 గనిపై ఘనంగా దుర్గామల్లికార్జునుడి కల్యాణం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 6 గనిపై దుర్గామల్లికార్జునస్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి మేనేజర్ కాదాసి శ్రీనివాస్, పిట్ కార్యదర్శి సంఘం సదానందం, ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ మోహన్ పటేల్ చేతుల మీదుగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఉప ప్రధాన కార్యదర్శులు ముష్కె సమ్మయ్య, కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, సంక్షేమాధికారి సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు జీఎం అభినందన


విజేతలను అభినందిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కంపెనీ స్థాయిలో బంగారు పతకాలు సాధించి కోల్ ఇండియా పోటీలకు ఎంపికైన సింగరేణి ఉద్యోగ క్రీడాకారులను బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం విజయ భాస్కర్‌రెడ్డి శనివారం గోలేటి జీఎం కార్యాలయంలో అభినందించారు. వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో భాగంగా ఇటీవల భూపాలపల్లిలో జరిగిన కంపెనీ స్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బెల్లంపల్లి ఏరియా మహిళా ఉద్యోగులు అనురాధ పవర్ లిఫ్టింగ్ 57 కిలో విభాగంలో, కోట్నాక మమత 47 కిలోల విభాగంలో బంగారు పతకాలు సాధించగా పురుషుల బాడీ బిల్డింగ్ విభాగంలో మొగిలి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నారు. కోల్ ఇండియా పోటీలకు ఎంపికైన నేపథ్యంలో జీఎం వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు శ్రీనివాస్, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహెరా, డీజీఎం మదీనాభాషా, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, పర్సనల్ హెచ్ఓ డీఎం శ్రీనివాస్, మేనేజర్ మహేష్, స్పోర్ట్స్ సమన్వయక కర్త అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి


వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్ ఓసీపీ ఓబీ కంపెనీలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని భారతీయ జనతా పార్టీ శ్రీరాంపూర్ జోన్ అధ్యక్షుడు సత్రం రమేశ్ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్‌కు ఓసీపీలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పబ్బతినేని కమలాకర్‌రావు, నస్పూర్ జోన్ అధ్యక్షుడు కుర్రె చక్రవర్తి, శ్రీరాంపూర్ జోన్ ప్రధాన కార్యదర్శి బద్రి శ్రీకాంత్ నాయకులు కట్కూరి తిరుపతి, అగ్గు మల్లేష్, భీమిని కుమార్, నారగోని సతీష్ గౌడ్, జెట్ట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రఘువర్ధన్

కోటపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పటేల్ కాలనీ సాధన డిఫెన్స్ స్పోర్ట్స్ అకాడమీలో 35వ సబ్ జూనియర్ జిల్లా ఎంపిక పోటీల్లో కోటపల్లి మండలం పారుపల్లి గ్రామానికి చెందిన తలారి రఘువర్ధన్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ రామచంద్ర, కోచ్ బోగె ప్రేమ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈనెల 28 వరకు నిజామాబాద్ జిల్లా ముష్కల్ విలేజీలో జరిగే 35వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. రఘువర్ధన్‌ను సీనియర్ క్రీడాకారులు, గ్రామస్థులు అభినందించారు.

ఆర్థిక సహాయం

భీమారం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన వుసుకమల్ల కళ్యాణ్ అమెరికాలో జరిగే పారాసిట్టింగ్ వాలీబాల్ వరల్డ్ కప్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడు కళ్యాణ్‌కు శనివారం పోలంపల్లి మాజీ సర్పంచు దర్శనాల రమేష్ రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించారు. భవిష్యత్‌లో తన వంతు సాయం చేస్తానని రమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక యువకులు పాల్గొన్నారు.

మందమర్రిలో కోల్‌కతా కాళి

- అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు 54ఏళ్లు
- కోల్‌కతా అమ్మవారి తరహాలో పూజలు


దుర్గమాత విగ్రహం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గమాత విగ్రహ ప్రతిష్ఠాపనకు 54 ఏళ్లు పూర్తికావస్తోంది. కోల్‌కతాలోని దుర్గామాత తరహాలోనే ఇక్కడ పూజలు నిర్వహిస్తుంటారు. తొమ్మిదిరోజుల పాటు అమ్మవారిని ఉదయం, సాయంకాలం వేళల్లో కొలుస్తూ పూజలు నిర్వహిస్తున్నారు. 1973లో వేంకటేశ్వరస్వామి ప్రధాన ఆలయ అర్చకులు సుదర్శనచార్యులు, ఆయన తనయులు అనంతచార్యులు కోల్‌కతాకు చెందిన కళాకారులను పిలిచి ప్రత్యేకంగా అక్కడే మండపంలోనే అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అప్పటి నుంచి ఆచారంగా ప్రతీ సంవత్సరం దసరాకు తొమ్మిది రోజుల ముందు అక్కడి కళాకారులు వచ్చి అమ్మవారి విగ్రహాన్ని తయారుచేసిన అనంతరం ప్రతిష్ఠాపన చేస్తున్నారు. ప్రతీరోజు వేలాదిభక్తులు దర్శించుకుంటున్నారు. ఈ ఉత్సవాలకు సింగరేణి యాజమాన్యం చేయూతనం దిస్తుంది.

● దసరా ప్రత్యేకం...

జిల్లా కేంద్రంతో పాటు పక్కనే ఉన్న బెల్లంపల్లి, మందమర్రి మండలం మారూమూల గ్రామాలకు చెందిన భక్తులుదర్శనం కోసం బారులు తీరుతుంటారు. అమ్మవారు కోల్‌కతా కాళీమాత తరహాలో చేతిలో శూలం ధరించి మహిసాసూరున్ని చాతిపై పాదం పెట్టి సంహారం చేస్తున్న రూపంలో ఉంటుంది. ఈ సంవత్సరంతో 54సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అమ్మవారికి నవరాత్రిరోజులు వైభవంగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ముగింపు ఉత్సవంతో పాటు వేంకటేశ్వరస్వామి శావ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులశాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి దంపతులు హాజరు కానున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఆహ్వాన పత్రికలు సిద్ధంచేసి ఆలయ అర్చకులు అనంత చార్యులు, నర్సింహాచార్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారు...

_ అనంతచార్యులు, ఆలయ అర్చకులు



కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా దుర్గామాత ప్రసిద్ధి చెందింది. జిల్లానే కాకుండా దూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారి కృపకు పాత్రులవు తుంటారు. కోల్‌కతాలోని దుర్గామాత తరహాలోనే ఇక్కడ కూడా పూజలు నిర్వహిస్తున్నాం.

'స్థానిక' రిజర్వేషన్లు ఖరారు

(5వ పేజీ తరువాయి)

● బీసీలకు 42 శాతం అమలు...

స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆ అధికారుల నివేదిక ప్రకారం.. పంచాయతీల్లో వార్డులు మొదలుకొని జడ్పీచైర్మన్ స్థానం వరకు క్షేత్రస్థాయిలో రిజర్వేషన్లలో మార్పులు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలో.. బీసీ కులగణన సర్వే పూర్తయినందున జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేశారు. దీంతో ఇంతకాలం రిజర్వేషన్లు అనుకూలించక పోటీకి దూరంగా ఉన్న బీసీ సామాజిక వర్గాలకు ఆ అవకాశం లభించనుంది. రిజర్వేషన్లు మారడంతో సర్పంచ్ ఎన్నికల కోసం సిద్ధమవుతున్న ఆశావహులు ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే కుతూహలంతో ఉన్నారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్‌చట్ట సవరణ చేయడం ద్వారా రిజర్వేషన్లు పదేళ్ల వరకు ఉండేలా మార్పులు చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లకోసారి రిజర్వేషన్లలో మార్పులు చేసేలా చట్ట సవరణ చేయడంతో ఆశావహులు పోటీ చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. ఇదిలా ఉండగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో వివిధ కేటగిరీల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కేటాయించగా, సాంఘిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన ప్రకారం బీసీ రిజర్వేషన్లు ఖరారు చేశారు.

జిల్లాలో 306 పంచాయతీలు....

త్వరలో స్థానికసంస్థల ఎలక్షన్లకు సంబంధించి షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో జిల్లాలోని 306 గ్రామపంచాయతీల్లో ఎన్నికల సందడి నెలకొంది. గతంలో మొత్తం 311 గ్రామపంచాయతీలకు గాను హాజీపూర్ మండలంలోని ఐదు జీపీలను మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. దీంతో జీపీల సంఖ్య 306కు తగ్గింది. జిల్లాలో మొత్తం 16 మండలాలు ఉన్నాయి. ఎంపీటీసీ స్థానాలు 129 ఉన్నాయి. గతంలో 130 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మున్సిపల్ కార్పొరేషన్‌లో మూడు స్థానాలు విలీనం అయ్యాయి. దీంతో వాటి సంఖ్య 127కు తగ్గింది. మళ్లీ కొత్తగా భీమిని, భీమారం మండలాల్లో అధనంగా రెండు ఎంపీటీసీ స్థానాలను పెంచారు. దీంతో మొత్తం ఎంపీటీసీ స్థానాల సంఖ్య 129కి చేరింది. కాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనుండగా, అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రి జిల్లాకు ఇప్పటికే చేరింది.

జడ్పీ పీఠం బీసీ మహిళకే...

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా శనివారం జడ్పీటీసీ రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. అయితే జిల్లా పరిషత్ పీఠం బీసీ మహిళకు రిజర్వు అయింది. బీసీలకు ప్రభుత్వం 42 శాతం సీట్లు కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. మంచిర్యాల మొదటి జడ్పీ చైర్‌పర్సన్‌గా చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు సతీమణి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నల్లాల భాగ్యలక్ష్మి బాధ్యతలు నిర్వర్తించారు.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కొండా లక్ష్మణ్ బాపూజీ




కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా, దండేపల్లిలో పద్మశాలీలు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకించిన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య, నిజాం వ్యతిరేక ఉద్యమంలో బాపూజీ చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. రాజకీయ రంగంలో వివిధ పదవుల్లో ప్రజా శ్రేయస్సుకు ఎనలేని సేవలందించారన్నారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్సెట్టిపేట పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు వేముల రాజగురువయ్య, గౌరవ అధ్యక్షుడు కట్ల చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి బండి రాజలింగు, బైరి శ్రీనివాస్, రవి, చందు, రమేష్, గంగన్న, బైరి సత్యనారాయణ, పేరగాని శంకర్, హను మండ్ల శంకర్, వేముల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో దండేపల్లి పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు శంకర్, నాయకులు దేవయ్య, లక్ష్మణ్, శంకరయ్య, శ్రీనివాస్, రాజ్‌కుమార్, వెంకటపతి, తిరుపతి, శ్రీనివాస్, రామస్వామి, నబయ్య, దేవేందర్, సత్తయ్య, శ్రీనివాస్, శంకరవ్వ, చిలుకయ్య, లక్ష్మణ్, మంగ, రత్నమాల, ఉమదేవి, పాల్గొన్నారు.

తాండూర్: తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో జరిగిన వేడుకల్లో పద్మశాలి సంఘం నాయకులు రాంపెల్లి ఈశ్వరయ్య, మద్దికుంట రామచందర్, మామిడాల రాజేశం, బంక వెంకటేష్, బండి లింగమూర్తి, వనమాల కైలాసం, సురేష్, శ్రీనివాస్, అనిల్, చంద్రశేఖర్, నాగరాజు, సాయికుమార్, వెంకటేష్, సదానందం, సంతోష్, శ్రీకాంత్, రమేష్, సాంబమూర్తి, రామకృష్ణ, హరికృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలోని భక్త మార్కండేయ ఆలయం వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నాయకులు గంగయ్య, సత్యం, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నరేశ్, రమేశ్, రాజమౌళి పాల్గొన్నారు.

స్వరాష్ట్ర సాధనలో అలుపెరుగని కృషి..

మంచిర్యాల క్రైం: స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. కమిషనర్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచి ఇన్స్‌పెక్టర్ భీమేష్, చంద్రశేఖర్‌గౌడ్, దామోదర్, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా బాపూజీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బండి మల్లికార్జున్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చింతకింది తిరుపతి, కుమారస్వామి, కుందారపు రమేష్, గాదాసు బాపు, గడ్డం సుధాకర్, పైడి శంకర్, కంది శ్రీనివాస్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.


తాండూర్‌లో..

నేడు యూరియా పంపిణీ

మందమర్రిరూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలంలోని సొసైటి కార్యాలయంలో ఆదివారం యూరియాను పంపిణీ చేస్తామని ఏఈవో ముత్యం తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ కార్యాలయానికి 266 బస్తాల యూరియా వచ్చిందని తెలిపారు. గతంలో యూరియా కోసం టోకెన్‌లు తీసుకుని యూరియా పొందని రైతులు ఉదయం 9.30 గంటల వరకు సొసైటీ కార్యాలయానికి రావాలని సూచించారు. పట్టాపాస్ బుక్, యూరియా కోసం తీసుకున్న టోకెన్‌లు, ఆధార్‌కార్డుతో రావాలన్నారు.

అందుబాటులో రేబిస్ టీకా

మందమర్రిరూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రేబిస్ వ్యాధికి టీకా అందుబాటులో ఉందని ప్రభుత్వ వైద్యుడు రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరినైనా కుక్కలు కరిస్తే వెంటనే మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి టీకా తీసుకోవాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

భీమిని, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ పంచాయతీలోని తంగళ్లపల్లి గ్రామానికి చెందిన ఇందూరి భూమయ్యకు మంజూరైన 38 వేల రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును తిమ్మాపూర్ మాజీ సర్పంచు ఇందూరి భూమయ్య శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ ఆదేశాల మేరకు చెక్కును అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

మహిళలకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం జాఫర్‌నగర్‌లో మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రావుల ఉప్పలయ్య మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగను పురస్కరించుకొని 450 చీరలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో బతుకమ్మ కష్టాలు

- నిధులు కేటాయించని కార్పొరేషన్ అధికారులు


వేంపల్లిలో బతుకమ్మ ఆడే ప్రదేశంలో ఉన్న బురదమయం

హాజీపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల కార్పొరేషన్‌లో ఇటీవల విలీనమైన హాజీపూర్‌లోని గ్రామాల్లో బతుకమ్మ ఆడేందుకు తిప్పలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కార్పొరేషన్ విలీనగ్రామాలైన వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట, నంనూర్, చందనాపూర్, నర్సింగాపూర్ గ్రామాలకు బతుకమ్మ సంబురాల కోసం కార్పొరేషన్ అధికారులు నిధులు కేటాయించలేదు. దీంతో బతుకమ్మ లు ఆడే ప్రదేశాల వద్ద వర్షాలు కురుస్తుండగా బురదలోనే ఆడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మొరం పోయడానికి, చదును చేయడం కోసం కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా నిధులు లేవంటూ చేతులెత్తేస్తున్నారు. కనీసం వీధి దీపాలు లేక చీకటిలోనే బతుకమ్మలు ఆడాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా సోమవారమే సద్దుల బతుకమ్మ ఉందని కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి బతుకమ్మ గాట్ల వద్ద చదును చేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విలీన గ్రామాల మహిళలు కోరుతున్నారు.

ఖాళీ ప్లేట్లతో హాస్టల్ వర్కర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న హాస్టల్స్ వర్కర్లు

నస్పూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హాస్టల్స్‌లో పని చేస్తున్న వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయు ఆధ్వర్యంలో ఖాళీ ప్లేట్లతో వర్కర్లు వినూత్న పద్ధతిలో ధర్నా నిర్వహించారు. పండగ పూట తమను పస్తులతో ఉండమంటారా అని ఖాళీ పేపర్ ప్లేట్లను పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను కలెక్టర్ కార్యాలయ ఏఓ రాజేశ్వర్, బీసీ వేల్ఫేర్ డీడీ పురుషోత్తంలకు అందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, బీసీ హాస్టల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వప్న, లక్ష్మి, నాయకులు కళావతి, దుర్గ కళ, రజిత, మెహర్ బాబా, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో గుండెపోటు నివారణ

కాసిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్మికుడు పనిస్థలాలతో పాటు ఇంట్లో అప్రమత్తంగా, ఆరోగ్యంగా ఉండడం వల్లనే గుండెపోటును పూర్తిస్థాయిలో నివారించవచ్చని మందమర్రి ఏరియా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కాసిపేట 2వ గనిపై కార్మికులకు గుండెపోటు నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పొగ తాగడం, మద్యం సేవించడం, రక్తంలో కొలస్ట్రాల్ ఎక్కువగా ఉన్న వారికి అధిక రక్తపోటుతో బాధపడేవారికి , అధిక బరువు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురైన వారికి, శరీర వ్యాయామం చేయడానికి గుండెపోటు అధికంగా వచ్చే ప్రమాదం ఉందన్నారు. గని మేనేజర్ గొడిసెల లక్ష్మీనారాయణ, సేఫ్టీ ఆఫీసర్ రవి శంకర్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, గని పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, పాల్గొన్నారు.


ఘనంగా బతుకమ్మ సంబరాలు


బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో శనివారం రాత్రి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కలెక్టర్ కుమార్ దీపక్, కలెక్టర్ సతీమణి స్వస్తిక, అదనపు కలెక్టర్ చంద్రయ్య హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో ప్రకృతికి ప్రత్యేకస్థానం ఉందన్నారు. ప్రకృతిలో లభించే పూలను బతుకమ్మగా పేర్చి దేవతగా పూజించే ఏకైక పండగ బతుకమ్మ అని తెలిపారు. అనంతరం జిల్లా అధికారులు, మహిళ ఉద్యోగులు, స్వయం సహాయక మహిళలతో కలిసి కలెక్టర్ నృత్యం చేసి అందరిలో ఉత్సాహం నింపారు. మహిళ ఉద్యోగులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. మెప్మా ఆర్పీలు, మహిళ సిబ్బంది బతుకమ్మలతో వచ్చి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం మండల కార్యవర్గం


పద్మశాలి సంఘం కార్యవర్గ కమిటి సభ్యులు

దండేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల పద్మశాలి సంఘం కార్యవర్గాన్ని దండేపల్లిలోని పద్మశాలి సంఘ భవనంలో సంఘం నాయకుల సమక్షంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎనగందుల చిన్నదుబ్బయ్య, అధ్యక్షుడిగా వంగ శంకరయ్య(నర్సాపూర్), ఉపాధ్యక్షులుగా అడ్డగట్ల శంకరయ్య (రంగంపల్లి), కొండి శంకరయ్య (మామిడిపల్లి), ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల సత్యం (దండేపల్లి), సంయుక్త కార్యదర్శులుగా లశెట్టి చిలుకన్న(కన్నెపల్లి), బోల్లి శ్రీనివాస్(మ్యాదరిపేట), కోశాధికారిగా సాంబరి కిషన్(గూడెం) ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శిగా వొడ్నాల శంకర్(దండేపల్లి), ముఖ్య సలహాదారులుగా వడ్డెపల్లి దేవయ్య, అలిశెట్టి లక్ష్మణ్, బిల్ల శంకరయ్య, వడ్డెపల్లి రమేష్, శ్యామల శ్రీని వాస్, వావివాల మల్లేష్, దీకొండ మహేందర్, దోమల లక్ష్మణ్, గంగుల శ్రీనివాస్, ఎనగందుల భూమన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కేకే5 గనిలో కొనసాగుతున్న పూజలు

మందమర్రిటౌన్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని కేకే5 గని వద్ద దేవి నవరాత్రి ఉత్సవాల్లో వివిధ పూజ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గని ఆవరణలోని మైసమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆలయ ప్రాంగణంలో దుర్గమాత అమ్మవారి చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్నారు. గని ముఖ ద్వారం వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారు ఉద్యోగులను వారి కుటుంబాలను క్షేమంగా చూడాలితల్లి అంటూ వేడుకున్నారు. రెండు రోజులుగా జరుగుతున్న పూజ కార్యక్రమాల్లో ఎస్ఓటు జీఎం విజయ్ ప్రసాద్‌తో పాటు గ్రూపు ఏజెంటు రాందాసు, గని మేనేజర్ శంభునాథ్‌పాండే, సంక్షేమాధికారి రవళి, గుర్తింపు సంఘం నాయకులు కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్ పాల్గొన్నారు.

పండుగ పూట కాసుల పంట

● పూల సాగుతో ఉపాధి పొందుతున్న యువకులు

కాసిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతీపండగ ప్రకృతినుంచి వచ్చిందే... హిందూ పండగల్లో పూలదే ప్రత్యేక స్థానం. పండగ ఏదైనా పూలతోనే మొదలవుతుంది. అలాగే బతుకమ్మ పండగను తీరొక్కపూలతో పూజించడమే పూల పండగ. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు మండలంలోని ధర్మారావుపేటకు చెందిన ఇద్దరు యువ రైతులు పూలసాగు వైపు దృష్టి సారించి ఆదాయం పొందుతున్నారు. ధర్మారావుపేటకు చెందిన జాగెటి సంజీవ్, చీమల శ్రీకాంత్ డిగ్రీ చదువుకున్నా ఉద్యోగం రాలేదు. అయినా నిరాశ చెందకుండా వ్యవసాయంపై మక్కువ పెంచు కున్నారు. సంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి సొంతభూమిలో పూలసాగు మొదలు పెట్టారు. సంజీవ్.. సీతమ్మజెడలు సాగు చేయగా, శ్రీకాంత్.. బంతి పూలు సాగు చేస్తున్నాడు. దసరాతో మొదలైన పూల పండగ దీపావళి, సంక్రాంతి, అయ్యప్ప పడి పూజలు, ఉగాది, మహాశివరాత్రి ఇలా ప్రతి కార్యక్ర మాల్లో పూలదే ప్రత్యేక ఆకర్షణ. పూల సాగు తో లాభసాటిగా ఉందని యువ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగం లేదని కుంగిపోలేదు

- చీమల శ్రీకాంత్, ధర్మారావుపేట



డిగ్రీ పూర్తి చేసిన నాకు ఉద్యోగం లేదని బాధపడలేదు. ఇంతకుముందు ఆహార పంటలతో పాటు పత్తి సాగు చేసుకునేవాళ్లం. కానీ ప్రకృతి వైపరీత్యాల వల్ల పత్తి పంటలో నష్టం ఎదుర్కోవాల్సి వచ్చింది. మార్కెట్ డిమాండ్, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పూలసాగు చేస్తే బాగుంటుందని ఆలోచించి ఇంటి ఆవరణలో ఉన్న అర ఎకరంలో బంతి పూలను సాగు చేశాను. రెండు నెలల్లో మంచి దిగుడి రావడంతో పాటు మంచి ఆదాయం వచ్చింది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే పూలతోట సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచుతాను.


ధర్మారావుపేటలో బంతిపూలు కోస్తున్న యువ రైతు శ్రీకాంత్

అబ్దుల్ కలాం అవార్డు అందుకున్న డాక్టర్ దాసారపు శ్రీనివాస్


అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీనివాస్

మందమర్రిటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): మందమర్రికి చెందిన శ్రీవిద్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సింగరేణి కోల్ బెల్ట్ డాక్టర్స్ కన్వీనర్ డాక్టర్ దాసారపు శ్రీనివాస్ ప్రతి ష్టాత్మకమైన ఏపీజే అబ్దుల్‌కలాం అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఏసీటీ నవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి హైటెక్ సిటీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రముఖ సామాజిక కార్యకర్త కేఎస్ మూర్తి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ అవార్డు వైద్యునిగా మరింత బాధ్యత పెంచిందని తెలిపారు.

రావణాసుర వధను నిలిపివేయాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిలక్ స్టేడియంలో దసరా రోజు చేపట్టే రావణసుర వధను నిలిపివేయడానికి కృషి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే వినోద్‌కు దళిత సంఘాల నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. రావణాసుర వధకు అనుమతులు ఇవ్వవద్దని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి దళిత సంఘాల అధ్యక్షులు కుంబాల రాజేశ్, చిలుక రాజనర్స, ప్రధాన కార్యదర్శి గోమాస రాజం, నాయకులు పాల్గొన్నారు.

3న దసరా సెలవు ఇవ్వాలి : సీఐటీయూ

శ్రీరాంపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అక్టోబర్ 2న గాంధీ జయంతి, దసరా పండుగ వస్తున్నందున 3వ తేదీన దసరాసెలవు ఇవ్వాలని సీఐటీయూ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా తెలంగాణ ప్రజలకు అతిపెద్ద పండుగ అని, అయితే గాంధీజయంతి రోజున వచ్చినందున ఉత్సవాలు జరుపుకునే ఉండదన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి దసరా సెలవును 3వతేదీకి మార్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ సభ్యుడు ప్రవీణ్ కుమార్, నాయకుడు పెరుక సదానందం, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలి మృతి

కాసిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవాపూర్‌కు చెందిన ప్రభుత్వఉపాధ్యాయురాలు పర్వకి చంద్రకళ (45) గుండెపోటుతో మృతిచెందింది. మండలంలోని దేవాపూర్ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. శనివారం మధ్యాహ్నం ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పి కింద పడిపోయింది. గమనించిన కుటుంబీకులు మంచిర్యాలకు తరలించారు. మెరుగైన వైద్యంకోసం హైద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. చంద్రకళ మృతి పట్ల ఉపా ధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

'స్థానిక' రిజర్వేషన్లు ఖరారు..

- బీసీలకు 42 శాతం అమలు
- తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

మంచిర్యాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల పనులు వేగం పుంజుకున్నాయి. వివిధ కేటగరీలకు సంబంధించిన రిజర్వేషన్లను శనివారం లాటరీ పద్ధతి ద్వారా స్థానాల వారీగా ఖరారు చేశారు. రాష్ట్రంలో మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి, ఆ తరువాత రెండు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికలు ముగియగానే, స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం అయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, పాలనపై పట్టు సాధించేందుకు కొంత సమయం పట్టింది. గ్రామ పంచాయతీల పాలన గత సంవత్సరం జనవరిలో ముగియగా, జిల్లాపరిషత్, మండల పరిషత్‌ల పాలకవర్గాల పదవీకాలం జూలై నెలతో ముగిసింది. దీంతో స్థానిక సంస్థలపాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లింది. ప్రభుత్వం ఇచ్చినమాట ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం సీట్లు కేటాయిస్తూ జీవో జారీ చేయడంతో ఆ మేరకు జిల్లా అధికారులు సైతం రిజర్వేషన్లు ఖరారు చేశారు.

(మిగతా 7లో..)



జిల్లా పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న బ్యాలెట్ బాక్సులు

సర్పంచ్ రిజర్వేషన్లు

మండలం	ఎస్టీ	ఎస్సీ	బీసీ	జనరల్
భీమారం	2	3	4	2
చెన్నూరు	2	11	12	5
దండేపల్లి	11	4	9	6
హాజీపూర్	4	3	3	2
జైపూర్	1	8	8	3
జన్నారం	9	6	10	4
కోటపల్లి	3	12	12	4
లక్షెట్టిపేట	2	4	7	5
మందమర్రి	2	3	4	1
భీమినీ	1	3	5	3
కన్నెపల్లి	1	4	6	4
వేమనపల్లి	2	4	6	2
బెల్లంపల్లి	2	5	7	3
కాసీపేట	17	1	3	1
నెన్నెల	3	6	8	2

జడ్పీటీసీ, ఎంపీపీలకు..

జిల్లాలో మొత్తం16 జడ్పీటీసీ స్థానాలు ఉండగా, అందులో 42శాతం బీసీలకు కేటాయించారు. ఆ ప్రకారం ఏడుస్థానాలు బీసీలకు కేటాయించగా, రెండుస్థానాలు ఎస్టీలకు, నాలుగుస్థానాలు ఎస్సీలకు, మూడుస్థానాలను జనరల్‌కేటగిరి వారికి కేటాయించారు. మొత్తం జడ్పీటీసీస్థానాల్లో ఏడింటిని మహిళలకు కేటాయిచారు.

అలాగే ఎంపీపీ 16స్థా నాలు ఉండగా, జడ్పీటీసీ మాదిరిగానే ఆయా వర్గాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఎంపీపీ మొత్తం స్థానాల్లో ఏడుసీట్లను మహిళలకు కేటాయించారు.

ఎంపీటీసీ రిజర్వేషన్లు

మండలం	ఎస్టీ	ఎస్సీ	బీసీ	జనరల్
భీమారం	1	1	2	1
చెన్నూరు	1	3	4	1
దండేపల్లి	1	3	6	4
హాజీపూర్	1	2	3	0
జైపూర్	0	4	4	2
జన్నారం	2	4	6	3
కోటపల్లి	1	3	4	1
లక్షెట్టిపేట	0	2	3	3
మందమర్రి	1	1	2	1
తాండూర్	1	2	4	2
కన్నెపల్లి	0	1	2	2
భీమిని	0	1	2	2
వేమనపల్లి	1	1	2	1
కాసిపేట	3	1	4	1
బెల్లంపల్లి	0	2	3	3
నెన్నెల	1	2	3	1

నిఘా నిరంతరం కొనసాగించాలి : డీసీపీ



సూచనలు ఇస్తున్న డీసీపీ

శ్రీరాంపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది నిఘా నిరంతరం కొనసాగించాలని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ అన్నారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ శనివారం ఆయన అకస్మాత్తుగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై శ్రద్ధ చూపాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. దుర్గా నవరాత్రులు, దసరా సందర్భంగా పెట్రోలింగ్ పక్కాగా నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్‌లోని క్రైమ్, లా అండ్ ఆర్డర్ ఇష్యూస్, సీసీ కెమెరాలు, సిబ్బంది పనితీరు గురించి సీఐ వేణుచందర్, ఎస్ఐ సంతోష్‌ను అడిగి తెలుసుకున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నస్పూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి టెక్నికల్ విభాగంలో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారిని కాంట్రాక్టు టెక్నికల్ ఎంప్లాయిస్‌గా గుర్తించి వేతనాలు పెంపునకు జీవో జారీ చేసినందున కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు శనివారం సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫ్లేక్సీకి ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో భూ భారతి ఉద్యోగుల జిల్లా కో ఆర్డినేటర్ రాజలింగు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

కులవృత్తుల ప్రోత్సాహానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే గడ్డం వినోద్

కాసిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కులవృత్తులను ప్రోత్స హించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రోత్సహిస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శనివారం కాసిపేట మండలం ముత్యంపల్లికి చెందిన ముద్దం రాధకు సంచార చేపల విక్రయ వాహనాన్ని అందజేసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మండలంలోని ఐదు గ్రామాలకు చెందిన 118మంది రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అంద జేశారు. ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన ద్వారా మంజూరైన రూ. 57.39 లక్షల విలువగల టార్పాలిన్, స్ప్రే బ్యాటరీలు, ఆయిల్ ఇంజన్‌లు, పవర్‌వీడర్, కరెంటు మోటారు, కల్టివేటర్, సోలార్ ఫెన్సింగ్‌కిట్‌లను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో డీఆర్ డీవో కిషన్, బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్, డీపీఎంరాజబాబు, ఏపీఎం రాజ్‌కుమార్, పీవోవెంకటకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పేదలకు అండగా ఉండి సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేసి మాట్లాడారు. ప్రజల అభివృద్ధి కోసం వివిధ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభు త్వం ప్రవేశపెడుతుందని అర్హులైన ప్రతీఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చిలుముల శంకర్, బండి ప్రభాకర్, రాయలింగు, మల్లయ్య, తహసీల్దార్ క్రిష్ణ, నాయకులు పాల్గొన్నారు.



సంచార చేపల విక్రయ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వినోద్

తాండూర్: తాండూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 36మంది లబ్ధిదారులకు తహసీల్దార్ జ్యోత్స్న కాంగ్రెస్ నాయకులతో కలిసి కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్మన్ పీఠం బీసీ మహిళకే

- రిజర్వేషన్ ఖరారు చేసిన ప్రభుత్వం 7

జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని, రైతులు అవసరం మేరకు వినియోగించుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని ఇస్లాంపుర ప్రాంతంలోని మార్క్ ఫెడ్ జిల్లా కార్యాలయం, రాజీవ్‌నగర్‌లోని గోదాములను ఆకస్మికంగా సందర్శించి యూరియా నిల్వల వివరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో యూరియా ఉందని, అవసరం మేరకు తీసుకుని వినియోగించుకోవాలన్నారు. జిల్లావ్యవసాయ, సంబంధితశాఖల సమన్వయంతో యూరియా పక్కదారి పట్టకుండా నిరంతరం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై ఏర్పాటుచేసిన శిక్షణ కార్య క్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం త్వరలో పంచాయతీ ఎన్ని కలు నిర్వహించే అవకాశం ఉన్నందున తదనుగుణంగా ఎన్నికల నిర్వహించే అవకాశం ఉన్నందున ఎన్నికల నిర్వహణలో అధికారులకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అనుమా నాలు, అపోహలు ఉన్నా శిక్షణ సమయంలో నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ అనంతర రెండో విడత శిక్షణ కార్యక్రమం ఉంటుం దని తెలిపారు. డీపీవో వెంకటేశ్వర్‌రావు, ట్రైనింగ్ నోడల్‌అధికారి శంకర్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా చండీయాగం



మంచిర్యాలలో చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు



నస్పూర్‌లో చండీహోమంలో పాల్గొన్న భక్తులు

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా శనివారం పాత మంచిర్యాల రామలింగేశ్వర ఆలయంలో మహాచండీయాగం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు బుడి అరుణ్‌శర్మ ఆధ్వర్యంలో 40మంది వేద బ్రాహ్మణులు 27 హోమగుండాలలో యాగాన్ని 108జంటలతో నిర్వహించారు. రామాలయం,శివాలయం ఆలయకమిటీ యాగ నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వర్ష ప్రభావంతో ఇబ్బందులు లేకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తూముల వెంకటేష్, తూముల నరేష్, బొలిశెట్టి కిషన్, చింతకింది మల్లయ్య, పెంట రజిత, పూరేళ్ల పోచమల్లు, శంకరయ్య, మహి ళలు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. పూజ అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

నస్పూర్: నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ గణపతి ఆలయంవద్ద దుర్గామాత నవరాత్రులను పురష్కరించుకుని శనివారం చండీ హోమం వైభవంగా జరిగింది. వేదపండితులు రంజిత్ శర్మ, వంశీ కృష్ణ శర్మల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఈ హోమంపూజ కార్యక్రమంలో 27జంటలు పాల్గొన్నాయి. ఆదివారం దుర్గా మాత మండపం వద్ద అన్నదాన కార్యక్రమం జరుగుతుందని పూజారి వంశీ కృష్ణ శర్మ తెలిపారు.

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లిలో ఏర్పాటు చేసిన దుర్గదేవి విగ్రహ మండపం వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా 108రకాల నైవేద్యాలను భక్తులు సమర్పించారు. శుక్రవారంరాత్రి మహిళలు దీపారాధన పూజలను చేశారు. దండేపల్లిలో ఏర్పాటు చేసిన దుర్గదేవి మండపం వద్ద అన్నదానం వితరణ చేపట్టారు. అమ్మగారి అనుగ్రహం అందరిపై ఉండాలని భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేకపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని 2వజోన్, 1వ జోన్‌తో పాటు పాతబస్టాండ్, రామన్‌కాలనీ, వెంకటేశ్వర టెంపుల్ ఏరియాలో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవార్లను నిత్యం పూజలు అందుకుంటున్నారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఏటీసీలను యువత సద్వినియోగం చేసుకోవాలి

జన్నారం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏటీసీ సేవలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. శనివారం మండలంలోని కిష్టాపూర్‌లో ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక కేంద్రం(ఏటీసీ)ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటీసీలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన యువతకు నెలకు రెండు వేల రూపాయల స్కాలర్‌షిప్ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బండి రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ, నాయకులు ముత్యం సతీష్, ఇంధయ్య, రమేశ్ పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: రోజు రోజుకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతకు అనుగుణంగా వృత్తి విద్య కోర్సులు అందించేందుకు ప్రభుత్వం



కిష్టాపూర్‌లో ఏటీసీ కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్‌లను (ఏటీసీ) ఏర్పాటు చేసిందని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏటీసీ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్‌త ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవా లని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పట్టణంలోని ఐటీఐ కళాశాలలో నూతనగా రూ. 45కోట్లతో నిర్మించిన అడ్వాన్సుడ్ టెక్నా లజీ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఏటీసీ సెంటర్‌లను పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రాజలింగు, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఐటీఐ ప్రిన్సిపల్ దేవానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

నస్పూర్: నస్పూర్‌లోని ప్రగతి కాలనీలో నూతనంగా నిర్మించిన ఉపాధి శిక్షణ అధునాతన సాంకేతిక కేంద్రం (ఏటీసీ)ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ప్రారంభించారు. అనంతరం ఏటీసీలోని తరగతి గదులు, యంత్రాలను ఆయన పరిశీలించారు. సమావేశంలో టీజీ ఐఐసీ జోనల్ మేనేజర్ మహేశ్వర్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రవిక్రిష్ణ, తహసిల్దార్ సంతోష్, శ్రీరాంపూర్ ఐటీఐ ప్రిన్సిపల్ సుజాత, ఏటీసీ ఇన్‌చార్జీ రాజామొగిలి స్థానికులు తదితరులు పాల్గొన్నారు.